## క్లుప్తంగా

### మైగ్రేన్‌పై అవగాహన సదస్సు

**కోట:** తగిన జాగ్రత్తలు తీసుకుంటే మైగ్రేన్ తలనొప్పిని సులభంగా నయం చేయవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర తెలిపారు. కోటలోని జనతా క్లినిక్‌లో బుధవారం మైగ్రేన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ సంఘమిత్ర మాట్లాడుతూ మైగ్రేన్ తలనొప్పి లక్షణాలు, వైద్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇటీవల మైగ్రేన్ బాధితుల సంఖ్య పెరుగుతోందన్నారు. ముందుగా గుర్తించి చికిత్స తీసుకుంటే నయం అవుతుందన్నారు. ఈ సదస్సులో డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

### ఘనంగా చెల్లాతమ్మ జాతర



పోలేరమ్మకు అంబలి పోస్తున్న గ్రామస్తులు

**తడ:** కారూరు గ్రామంలో బుధవారం గ్రామ దేవత చెల్లాతమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ప్రతి ఏటా తమిళనాడు సంప్రదాయం ప్రకారం చెల్లాతమ్మ జాతరను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా తొలుత గ్రామంలోని పోలేరమ్మకు అంబలిని నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం చెల్లాతమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

### హోరాహోరీగా క్రికెట్ పోటీలు

**వెంకటగిరి రూరల్ :** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తారకరామా క్రీడా ప్రాంగణంలో సౌత్ జోన్ సీనియర్ విభాగం క్రికెట్ పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. మంగళవారం చిత్తూరు–అనంతపురం జట్లు తలపడగా చిత్తూరు జట్టు 98.5 ఓవర్లకు 467 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు 55.5 ఓవర్ల 267 పరుగులు చేసింది. 4 వికెట్లు కోల్పోయింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు 117.03 ఓవర్లకు 554 పరుగులు చేసి ఆలౌట్ అయింది.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

**రాపూరు:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బొజ్జనపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం హజరత్తయ్య తెలిపారు. గ్రామంలో బుధవారం సర్పంచ్ నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చెట్లను నరికేయడంతో వాతావరణ కాలుష్యం అవుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్ గుప్త, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### బీమా చెక్కు అందజేత



భాగ్యమ్మకు చెక్కు అందజేస్తున్న మేనేజర్ శ్రీనివాసులు

**రాపూరు:** ఇటీవల మృతిచెందిన ఇట్లా పెంచల నరసయ్య కుటుంబ సభ్యులకు బుధవారం రూ.2 లక్షల బీమా చెక్కును ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు అందజేశారు. రాపూరు మండలం రామిరెడ్డిపల్లికి చెందిన ఇట్ల పెంచలయ్య ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో ఏప్రిల్‌లో తన అకౌంట్ ద్వారా ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద రూ.436 చెల్లించి బీమా తీసుకున్నాడు. ఇటీవల ఆయన గుండెపోటుతో మృతి చెందడంతో బీమా యోజన కింద భార్య భాగ్యమ్మకు రూ.2 లక్షలు అందజేసినట్టు మేనేజర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీదేవి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న పానాసోనిక్ ఎండీ సెంథిల్ కుమార్

**తడ:** పరిశ్రమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పానాసోనిక్ పరిశ్రమ ఎండీ ఆర్ సెంథిల్ కుమార్ తడ పంచాయతీ, పల్లెపాళెం ప్రాథమిక పాఠశాలలోని 68 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధితో పాటు పిల్లలకు చేయూత ఇవ్వడానికి పానాసోనిక్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు సరస్వతి, మల్లికార్జునరావు, హెచ్‌ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు సుధాకర్, విద్యాకమిటీ చైర్మన్ విద్య, పానాసోనిక్ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎస్‌ఎంసీ ఎన్నికల సందడి

**వెంకటగిరిలోని పాఠశాలల వివరాలు**

| కేటగిరి | పాఠశాలల సంఖ్య |
|---|---|
| ప్రాథమిక పాఠశాలలు | - 203 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు | - 12 |
| ఉన్నత పాఠశాలలు | - 24 |
| మొత్తం | - 239 |
| మొత్తం విద్యార్థుల సంఖ్య | - 13,609 |

- ఓటరు జాబితా విడుదల చేసిన హెచ్‌ఎంలు
- నేడు ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణ



దక్కిలి మండలం దగ్గవోలు జెడ్పీ హైస్కూల్‌లో నోటీస్ బోర్డులో అంటించిన ఓటరు జాబితా

**దక్కిలి:** ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికల సందడి మొదలయింది. వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల్లో మొత్తం 239 పాఠశాలలు ఉండగా వాటిలో 13,609 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ నెల ఒకటో తేదీన ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి పాఠశాలల్లోని నోటీసు బోర్డులో పెట్టారు. సోమవారం ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయడం, అనంతరం తుది జాబితా సిద్ధం చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష పద్ధతిలో చేతులెత్తడం ద్వారా ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికైన సభ్యులు ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత ప్రమాణ స్వీకారం ఉంటుంది. సాయంత్రం 3 నుంచి 5 గంటల్లోపు కొత్త కమిటీ సమావేశం జరుగుతుంది.

**239 పాఠశాలల్లో ఎన్నికలు..**

వెంకటగిరి నియోజకవర్గంలోని వెంకటగిరి పట్టణం, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో 239 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికైన సభ్యులతోపాటు ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్, మున్సిపల్ చైర్మన్, మండల పరిషత్ అధ్యక్షుడు వారి ప్రాంతాల్లో ఎప్పుడైనా ఎస్‌ఎంసీ సమావేశాలకు వారి ఇష్టప్రకారం హాజరు కావచ్చు.

**ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు**

గతంలో ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరిగినా ఎక్కడా ఎన్నికలు వాయిదా పడలేదు. ప్రశాంతంగా ముగిశాయి. ఒకటి రెండు చోట్ల వాయిదా పడినప్పటికీ తరువాత ఆ ఎన్నికలను కొనసాగించారు. కొన్ని పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు పోటాపోటీగా జరిగినా ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికలను సైతం కొందరు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎస్‌ఎంసీ కమిటీల్లో భాగస్వాములయ్యారు. కూటమి ప్రభుత్వంలో ప్రశాతంగా ఎన్నికలు నిర్వహిస్తారా అనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎన్నికల విధానం**

పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎన్నికలను నిర్వహించాలి. ఈ మేరకు తొలుత తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలి. 59 శాతం మంది తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలి. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లలు ఎన్ని తరగతుల్లో ఉంటే అన్ని తరగతుల్లో ఎన్నికల విధానంలో పాల్గొనవచ్చు. కానీ సభ్యులను ఎన్నుకునేందుకు ఓటు వేసేందుకు ఒక్కరికే అవకాశం ఉంటుంది. సాధారణంగా చేతులెత్తే ప్రక్రియ లేదా చెప్పడం ద్వారా ఎన్నికల జరగాలి. అసాధారణ పరిస్థితిలో బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించాలి.

**ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం**



దక్కిలి మండలంలో గురువారం జరగనున్న ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం. ఇప్పటికే అన్నీ పాఠశాలల్లో ఓటరు జాబితా, నోటిఫికేషన్ విడుదల చేశాం. ఎన్నికల నిర్వహించాల్సిన విధానాలపై హెచ్‌ఎంలకు వివరించాం. ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌లో పాల్గొనాలని ప్రతి విద్యార్థి తల్లిదండ్రులనూ ఆహ్వానించాం.

– వెంకటేశ్వర్లు, ఎంఈవో, దక్కిలి

# ఘనంగా చేనేత దినోత్సవం



రాష్ట్రపతి అవార్డు గ్రహీతలతో ఐఐహెచ్‌టీ అధ్యాపకులు

**వెంకటగిరి రూరల్:** వెంకటగిరి పట్టణంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)లో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీప్రగడ కోటయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. అనంతరం చేనేతలో ప్రతిభ చూపి రాష్ట్రపతి నుంచి అవార్డు పొందిన కూనా మల్లికార్జున్, సజ్జావీరయ్య, లక్కా శ్రీనివాసులు, పట్నం మునిబాబు, నక్కా వెంకటేశ్వరరావును సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కూనా మల్లికార్జున్ మాట్లాడుతూ వెంకటగిరి ప్రాంతంలో చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఐఐహెచ్‌టీని ఏర్పాటుచేశారని గుర్తు చేశారు. ఐఐహెచ్‌టీ అభివృద్ధికి తమ ట్రస్టు ద్వారా నిధులు సమకూరుస్తామన్నారు. వెంకటగిరికి చెందిన 13 మంది నేతన్నలు రాష్ట్రపతి అవార్డు పొందడం గర్వంగా ఉందన్నారు. కళాశాల ఓఎస్‌డీ గిరిధర్‌రావు మాట్లాడుతూ ఐఐహెచ్‌టీలో ఏపీతోపాటు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఎందరో విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్, ఏపీఆర్ఎస్, ఏపీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిరెడ్డి, వెంకటరత్నంరాజు, కళాశాల అధ్యాపకులు ఎస్.బాలసుబ్రమణ్యం, కిరణ్‌కుమార్, సాయిబాబా, నాగార్జున్, సతీష్, హారస్ బాషా పాల్గొన్నారు.

## కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**చిల్లకూరు:** చిల్లకూరులోని ప్రధాన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన బుధవారం చిల్లకూరులోని పలు ఎస్సీ, ఎస్టీ కాలనీలను పరిశీలించారు. స్థానికులు మాట్లాడుతూ మురుగు కాలువల్లో చెత్తను తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని వాపోయారు. దోమలు వృద్ధిచెంది రోగాలు ప్రబలుతున్నాయని వివరించారు. మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి ఇబ్బంది పడాల్సి వస్తున్నారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, మరొక వాటర్ ట్యాంకు నిర్మించాలని కోరారు. స్పందించిన ఆయన సమస్యలపై నివేదికలను సిద్ధం చేయించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు తానంకి నానాజీ, పట్టాభిరెడ్డి, రామచంద్రారెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

## కండలేరులో 6.039 టీఎంసీల నీరు

**రాపూరు:** కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 6.039 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ ద్వారా జలాశయంలోకి 200 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. అదేవిధంగా కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 118, లోలెవల్ కాలువకు 28 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి





జయజయరావు, నరసింహారావు



వాకాడు తహసీల్దార్‌ను సత్కరిస్తున్న డీటీ

**వాకాడు:** మండలంలోని ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ ఎస్. రామయ్య తెలిపారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెళ్లకూరు నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నరసింహారావు సూళ్లూరుపేటకు బదిలీ అయ్యారు. రామయ్యకు కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

**కోట తహసీల్దార్‌గా జయజయరావు**

**కోట:** కోట తహసీల్దార్‌గా జయజయరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జయజయరావు తెలిపారు.

**బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్**

**సూళ్లూరుపేట రూరల్:** సూళ్లూరుపేట తహసీల్దార్‌గా ఎస్.వి నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న గోపాలకృష్ణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వాకాడులో పనిచేస్తున్న తహసీల్దార్ నరసింహారావును ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది.

## పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్ వితరణ



కార్మికులకు యూనిఫామ్ అందజేస్తున్న అధికారులు, విశ్రాంతి ఉద్యోగ సంఘం సభ్యులు

**నాయుడుపేట టౌన్:** నాయుడుపేటకు చెందిన నందా జగదీష్‌కుమార్ 3వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఎన్ఆర్‌లు విజయప్రభ, శ్రీనివాసులురెడ్డి దంపతులు, సీహెచ్ సీతామహాలక్ష్మీ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 114 మంది, హిందూ శ్మశానవాటికలో పనిచేస్తున్న ఏడుగురు పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్ వితరణ చేశారు. పట్టణంలోని నాయుడు ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అలాగే మున్సిపాలిటీలో పనిచేసే వివిధ విభాగాల సిబ్బంది 40 మందికి దుస్తులు పంపిణీ చేసేందుకు ట్రినిటీ వైద్యశాల అధినేత ఆదవరం నాగూరయ్య ముందుకు వచ్చారు. వారికి ఆగస్టు 15న దుస్తులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీడీ ఉదయశంకర్, మునగాల కృష్ణారావు, విశ్రాంతి ఎస్ఐ శంకర్ రాజు, సాబ్‌జాన్, నాయుడుపేట రోటరీ క్లబ్ సభ్యులు రామ్మోహన్, డాక్టర్ గోపీనాథ్, మున్సిపల్ ఏఈ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

**ఓజిలి:** వర్షాకాలంలో వ్యాధులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి చిన్నయ్య తెలిపారు. ఆయన బుధవారం పున్నేపల్లిలో మహిళలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీరు కలుషితం అవుతుందని, దీనివల్ల ప్రజలు అతిసారం బారిన పడే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

### గొట్టిప్రోలు బాలుర హాస్టల్ తనిఖీ



వసతి గృహంలో పరిశీలిస్తున్న ఎంపీపీ ధనలక్ష్మీ

**నాయుడుపేట టౌన్:** మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని బుధవారం ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ పరిశీలించారు. వసతి గృహంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి వసతి లేకపోవడాన్ని గుర్తించి మండల పరిషత్ నిధులు మంజూరు చేశారు. ఇక్కడి పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు విన్నవించి సమస్యలు పరిష్కరించాలని మండల పరషత్ అధికారులను ఆదేశించారు.

### నేడు చేపల చెరువు వేలం

**ఓజిలి:** మండలంలోని మాచవరం సచివాలయంలో గురువారం చేపల చెరువు వేలంపాటలు ఈఓపీఆర్డి మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి పెద్ద మస్తానయ్య తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు నిబంధనల మేరకు డిపాజిట్ చెల్లించాలన్నారు.

### పెంచలకోనలో వర్షం

**రాపూరు:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో సమీపంలోని కొండల నుంచి జలపాతాలు ప్రవహిస్తున్నాయి. వాటిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

### చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**కోట:** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ తెలిపారు. విద్యానగర్‌లోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన న్యాయచట్టాలపై వివరించారు. విద్యార్థి దశలో చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు, ప్రిన్సిపాల్ వెంకన్న, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ పీఏసీఎస్ సీఈవో మృతి



శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

**చిల్లకూరు/బాలాయపల్లి(సైదాపురం):** మండలంలోని కోట క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పీఏసీఎస్ సీఈవో అలిమిలి శ్రీధర్‌రెడ్డి బుధవారం మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కడివేడుకు చెందిన అలిమిలి శ్రీధర్‌రెడ్డి (61) బాలాయపల్లి మండలం జయంపులోని పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్నారు. ఆయన విధులు ముగించుకుని మంగళవారం రాత్రి బైక్‌లో స్వగ్రామం బయలుదేరారు. కోట క్రాస్ రోడ్డు సమీపంలో పందులు అడ్డం రావడంతో కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు 108 ద్వారా గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

### స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్ ఐటీలో సీటు



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

**గూడూరు రూరల్:** చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అనూషా స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్ ఐటీలో సీటు పొందినట్టు హెచ్‌ఎం మముల్లాఖాన్ తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పీడీ కల్పన ఆధ్వర్యంలో అనూషా అండర్–17 హ్యాండ్‌బాల్, జూనియర్ హ్యాండ్‌బాల్, సీఎం కప్పు పోటీల్లో విజేతగా నిలిచిందన్నారు. ఈ క్రమంలోనే స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందన్నారు.

## డబ్బా పాలు వద్దు.. తల్లి పాలే ముద్దు





ర్యాలీ చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు



పెళ్లకూరు: తల్లిపాల వారోత్సవాలు

**గూడూరు రూరల్:** డబ్బా పాలు వద్దు.. తల్లిపాలే ముద్దు అని మైథిలీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం గూడూరులో భారీ ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కళాశాల నిర్వాహకులు రమణబాబు మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలు పట్టించాలన్నారు. తద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కొంత మంది పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల అందం పోతుందని అపోహ పడుతుంటారని తెలిపారు.

**పెళ్లకూరులో..**

**పెళ్లకూరు:** పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి తెలిపారు. కానూరులో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కొందరు అప్పుడే పుట్టిన బిడ్డలకు తేనె, ఆముదం తాగిస్తుంటారని తెలిపారు. దీనివల్ల పిల్లలు వ్యాధి బారిన పడతారని హెచ్చరించారు. ముర్రుపాలు తాగించడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు.

**నాయుడుపేటలో..**

**నాయుడుపేట టౌన్:** బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని ప్రభుత్వ వైద్యుడు షేక్ షఫీ తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నాయుడుపేటలోని జనరల్ పాఠశాల అంగన్‌వాడీ క్లస్టర్ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యకమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లులు జాగ్రత్తగా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంపూర్ణమ్మ ఏఎన్ఎం ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రూపాదేవి, డి.రత్నమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆర్థిక సాయం

**గూడూరు రూరల్:** ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్టు ద్వారా రోటరీ వెస్ట్ క్లబ్ సహకారంతో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి తెలిపారు. గూడూరులోని ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో బుధవారం వివిధ ప్రాంతాలకు చెందిన 8 మంది విద్యార్థులకు రూ.1.07 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ఆడిటర్ శ్రీకంఠి రామోహన్‌రావు ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. ఇందులో భాగంగా చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడంపై అభినందించారు. కార్యక్రమంలో నాశిన నాగులు, గిరిబాబు, ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, ఎస్ఎల్ఎస్‌బాబు, రాఘవరెడ్డి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు నేతల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

**గూడూరు రూరల్:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా దేశంలో అన్నదమ్ములుగా ఉన్న ఎస్సీల మధ్య చిచ్చుపెట్టినట్టుగా ఉందని మాల మాహానాడు నాయకుడు గోను శివకుమార్ తెలిపారు. మాల మహానాడు నాయకులు బుధవారం గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంకు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్ల క్రితం ఎస్సీలను వర్గీకరించాలని పలు కమిటీలు వేసినప్పటికీ అమలులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తీర్పును నిలుపుదల చేశారని తెలిపారు. నేడు సుప్రీం కోర్టు కొంత మంది మెప్పు కోసం ఏకపక్షంగా తీర్పు ఇచ్చిందన్నారు. తీర్పును నిరసిస్తూ త్వరలోనే మాలలంతా ఏకమై దేశ వ్యాప్త ఆందోళనలు చేస్తామన్నారు. మాలలు ఎక్కడికక్కడ శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తూ పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు చిరంజీవి, పిండి మనోహర్, గారాబాబు, పుట్టా శంకరయ్య, పర్వాతాల శివయ్య, శ్రీను, శ్రీకాంత్, ప్రశాంత, దాసరి క్రిష్ణ, బాబు, సారది, సాంబయ్య, పోలయ్య, రత్నం పాల్గొన్నారు.

### గోదాదేవికి ప్రత్యేక పూజలు

**సూళ్లూరుపేట:** గోదాదేవి జన్మనక్షత్రం సందర్భంగా సూళ్లూరుపేటలో వెలసిన బాలాంజనేయస్వామి ఆలయంలోని గోదాదేవి అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారి ఉత్సవమూర్తికి కలశాల్లోని పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. అనంతరం పాలాభిషేకం, పసుపు, తేనె, పంచదార, పంచామృతం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. గాదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాపా మల్లయ్య కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## సీఎస్ఆర్ నిధులతో పేదలకు వైద్య సేవలు



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు

**చిల్లకూరు:** పరిశ్రమల్లోని సీఎస్ఆర్ నిధులతో సమీప గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్టు జిందాల్ పవర్ ప్రాజెక్టు హెచ్ఆర్ ఖలీద్ తెలిపారు. లింగవరంలో బుధవారం వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిందాల్ వ్యవస్థాపక చైర్మన్ స్వర్గీయ ఓం ప్రకాష్ జిందాల్ జ్ఞాపకార్థం గతంలో కంటి వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఈ క్రమంలోనే రోగులకు కంటి అద్దాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. సమీప గ్రామాల్లో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే పరిశ్రమ ద్వారా వైద్యం అందిస్తామన్నారు. అలాగే విద్యకు సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తామని వివరించారు. పరిశ్రమ ప్రతినిధులు శ్రీకాంత్, జోబిస్ మ్యాథ్యూ, సీఎస్ఆర్ సభ్యులు పాల్గొన్నారు.

### యువతతోనే దేశాభివృద్ధి

**గూడూరు రూరల్:** యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని గూడూరు అదనపు జ్యుడిషియల్ జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి లోకనాథం తెలిపారు. గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేడు ఎక్కువ మంది యువకులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని తెలిపారు. దీనివల్ల మానవ మేథస్సు నిర్వీర్యం అవుతోందన్నారు. యువత మత్తుకు బానిసలుగా మారకుండా అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది కోటేశ్వరరరావు, కళాశాల ఏవో కొండారెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.